

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (నర్సాపురంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 29-6-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రయత్నంలేని స్థితి గురించి జె.కె. గారు చెప్పారు అని ఒకరు భగవాన్‌తో అంటే ప్రయత్న రహి స్థితి మంచిదేగాని ప్రయత్నం లేకుండా ప్రయత్నరహిత స్థితి ఎలా వస్తుంది అంటున్నారు భగవా మాటలు నేర్చుకోకుండా వాక్యాలు ఎలా వ్రాస్తావు. ప్రయత్నం లేకుండా నేచురల్‌గా ఉండే స్థి మంచిదేగాని నీవు ప్రయత్నం చేయకపోతే ప్రయత్నం లేని స్థితిని పొందలేవు. ప్రయాసలేని ఇచ్ఛ ఎరుకయే మన నిజస్వరూపం. మనం ఇప్పుడు సహజస్థితిలో లేము, అసహజస్థితిలో ఉన్నావ సహజ స్థితి నిజం, అసహజస్థితి అనిజం, ఏ మార్గంలో నడుచుకొంటే మనం బాగుపడతాము, మార్గం మనకు చెడును తీసుకొని వస్తుంది, ఎవరితో స్నేహం చేస్తే మంచి సంకల్పాలు వస్తాం ఎవరితో స్నేహం చేస్తే చెడు సంకల్పాలు వస్తాయి అనే విచక్షణ, ఆ సూక్ష్మబుద్ధి నీకు కలగటం లేదు. దీనికి నీ కృత్రిమ జీవితం కారణం, నీ ఉద్రేకం కారణం. మనకు నిగ్రహం లేకపోవటం వలన ఆగ్రహానికి గురి అవ్వటం వలన మనకు ఏది మంచిదో మనకు తెలియటం లేదు. మనకు ఒకరు అంటే ఇష్టం, ఒకరు అంటే అయిష్టం, ఒకరిని చూస్తే ప్రేమ, ఒకరిని చూస్తే అసూయ ఇలా మనస్సు ముక్కలు ముక్కలుగా విడిపోవటం వలన, ఆలోచించే శక్తిని కోల్పోవటం వలన సహజస్థితిని పొందలేకపోతున్నాము.

మనం ఒకటి మంచి అని అనుకోవచ్చు. ఒకోసారి అదే మనకు మంచి కాకపోవచ్చు. ఏదో ఉద్రేకంలో మనం అలా అనుకోవచ్చును. నీకు ఏది మంచిదో నీ కంటే ఎక్కువ భగవంతుడికి తెలుసు. కొంతమంది నోటికి వచ్చినట్లు మాట్లాడటం, చేతులు ఉన్నాయి కదా అని అది చెయ్యవచ్చో, చేయకూడదో తెలియకుండా మీ ఇష్టం వచ్చినట్లు చేతులతో పనులు చేయటం అది క్రమశిక్షణతో కూడిన జీవితం కాదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం నీకు ఉంటే, ఆయన మాటల మీద గౌరవం నీకు ఉంటే చేతికి వచ్చినట్లు పని చేయవు, నోటికి వచ్చినట్లు మాట్లాడవు అంటున్నారు భగవాన్. మీరు కేవలము మీ మనస్సును ప్రమాణంగా పెట్టుకోకుండా భగవంతుడు చెప్పిన మాటను, శాస్త్రమును ప్రమాణంగా పెట్టుకుంటే మీ జీవితాలు తీర్చి దిద్దబడతాయి, అనుకోకుండానే మీకు సహజస్థితి కలుగుతుంది. ప్రాణం పోతుంది. అంటే మనకు భయం, దేహానికి రోగం వస్తే భయం. కాని సహజస్థితిని పొందినప్పుడు నీ దేహంలో ప్రాణం తిరుగుతున్నా ప్రత్యేకమైన మమకారం ఉండదు, ఆ దేహంలో నుండి ప్రాణం పోయినప్పుడు దుఃఖం ఉండదు. సహజస్థితిని పొందనంతకాలం దేహంపట్ల మమకారం ఉంటుంది, మరణం అంటే భయం

ఉంటుంది. దేహాన్ని శ్రద్ధగా చూసుకోవచ్చు, ఆరోగ్యమును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు, దేహానికి సంబంధించిన అవసరాలు తీర్చుకోవచ్చు. దేహం మరణించక ముందే నీవు సహజ స్థితిని పొంది ఉంటే దేహం మరణించేటప్పుడు నీకు దుఃఖం రాదు. ఈ దేహంలో ఉండగానే దుఃఖం లేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతావు.

మనిషికి ఫీలింగ్స్ వస్తూ ఉంటాయి. వాటి గురించి అడిగితే నీవు ఏ విషయం గురించి ఆలోచిస్తున్నావో ఆవిషయానికి, ఆలోచించే మనస్సుకు ఉన్న సంబంధమే ఫీలింగ్. మీ మీద కోపం ఉంది అనుకోండి. ఒక రకమైన ఫీలింగ్ వస్తుంది, మీ మీద ఇష్టం ఉంది అనుకోండి ఒక రకమైన ఫీలింగ్ వస్తుంది. ఇది పూర్ణ సత్యంకాదు. నీ హృదయంలో ఉన్న అసలు సత్యానికి ఫీలింగ్‌కి సంబంధం లేదు.

నీ హృదయంలో ఒక సహజస్థితి ఉన్న మాట నిజం. కాని నీ ప్రయత్నం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా, ఈశ్వరునియందు భక్తి లేకుండా దానిని నీవు పొందలేవు. గురువు అనుగ్రహంలో ఉన్నవాడికి సహజస్థితి ప్రసాదించబడుతుంది. సహజస్థితి పొందటానికి ప్రయత్నం చేయండి, దాని గురించి ఊహించవద్దు. సహజ స్థితి పొందటానికి నీ శరీరం పోయేవరకు ఆగనక్కరలేదు. ఇప్పుడే ఇక్కడే పొందవచ్చు. నీ శరీరానికి 50 సం॥లు ఉండవచ్చు గాని నీ లోపల ఉన్న వాసనకు కొన్ని వేలు సంవత్సరాలు ఉంది. ఆ వాసనయొక్క ప్రభావం వలన ఉన్న వస్తువు లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా నీకు కనబడుతోంది. మిమ్మల్ని మూఢవిశ్వాసాలకు గురి చేయటం లేదు, మీ ఆలోచనను పెంచుకోండి అనిచెపుతున్నారు మీరు ప్రయాణం చేస్తున్న మార్గాన్ని చెడగొట్టటం ఇక్కడ ఉద్దేశం కాదు, మీరు ప్రయాణం చేస్తున్న మార్గంలోనే మీకు చేయూతనిచ్చి మిమ్మల్ని అభివృద్ధిలోనికి తీసుకొని రావటమే ఈ టీచింగ్ యొక్క ప్రయోజనం. నీ శరీరం ఉన్నా, లేకపోయినా నీకు ఆధారంగా ఉన్న వస్తువు ఒకటి ఉంది. ఉన్నది అదే. లేని శరీరం, లేని ప్రపంచం, లేని సంసారం నీకు ఉన్న దానివలే కనిపిస్తున్నాయి. దీనికి ఎవరో ఇతరులు కారణం అనుకోకు. వేలాది జన్మల నుండి వస్తున్న నీ వాసనలే కారణం. నీ వాసనలు బట్టి ఈ ప్రపంచం అనే స్టేజి మీద నాలుగు గంతులు వేసి వెళ్ళిపోతున్నావు.

మానవస్వభావం చాలా ఇరుకు. వత్తి ఏ విధంగా అయితే తానుకాలిపోతూ మనకు వెలుగునిస్తుందో అలాగ తాను కాలిపోతూ సమాజమునకు వెలుగునిచ్చేవాడి హృదయం విశాలమవుతుంది గాని ఈ బుడబుక్కల మాటల వలన హృదయం యొక్క లోతులు పెరగవు, మనస్సు విశాలం కాదు. మంచి పనిచేసేవాడు కూడా వాడిని మర్చిపోయి మంచి పని చేయడు. మంచి పని చేసేటప్పుడు కూడా వాడే జ్ఞాపకం వస్తూ ఉంటాడు. వాడిని మర్చిపోయి మంచి పనులు చేస్తే మనస్సు విశాలమవుతుంది. హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. అప్పుడు నీ వాసన కూలిపోయి రాలిపోతుంది. నీ వాసనను తగ్గించుకొనే ప్రయత్నం, నీ అలవాట్ల యొక్క వేగాన్ని తగ్గించుకొనే ప్రయత్నం నీవు చేయకపోతే నీ హృదయంలో నిజస్థితి ఉన్నప్పటికీ నీకు సాక్షాత్కారం కాదు సందేహరహితంగా నీ మనస్సును ఆత్మ మీద నిలబెట్టి ఉంచు. ఒక గోడను మనం కదపటానికి

ప్రయత్నం చేస్తాము అనుకోండి అది కదులుతుందా ? కదలదు. అంత స్థిరంగా నీ మనస్సును ఆత్మపైన నిలబెట్టి ఉంచు. అలా ఆత్మ మీద నిలబెట్టి ఉంచితే నీ వాసనలు కాలిపోయి రాలిపోతాయి ఈ శక్తి నీకు లేకపోతే వాసనలు నీ మనస్సును బయటకు లాగి విషయాల మీద వాలేటట్లు చేస్తాయి. అక్కడ నుండి రాగ ద్వేషములు ప్రారంభమవుతాయి. లోక వాసన, దేహ వాసన ప్రారంభమవుతుంది. లోక విషయాలు ఎన్నో వచ్చి ఈగలు ముసిరినట్లు నీ మనస్సును ముసిరేస్తాయి.

రోగం వచ్చిన తరువాత తగ్గించుకోవటం కంటే అసలు రోగం రాకుండా చూసుకోవటం మంచిది. తలంపు వచ్చిన తరువాత దానితో పోరాటం కంటే అసలు తలంపు రాకుండా చూసుకోవటం తెలివైన వాడి పద్ధతి. వివేకవంతులుగా జీవించండి. మనం అంతా జీవిస్తున్నాము ఏదో రకంగా జీవిస్తున్నాము, రోజులు ఏదో రకంగా వెళ్ళి పోతున్నాయి అనుకొంటున్నాము. ఎలాగు జీవిస్తున్నారు కదా ఆ జీవించేది వివేకవంతులుగా జీవించండి. మెడికల్ షాపులోనికి వెళ్ళినప్పుడు అన్ని మందులు మనం కొనుక్కోము. మన రోగానికి సంబంధించిన మందులు కొనుక్కొంటాము. అలాగే ప్రతీ మనిషి వాడిలో ఉన్న ఏ బలహీనత వలన మనస్సు బయటకు వస్తోందో చూసుకోవాలి. వాడిలో ఏ బలహీనత ఉందో ఆ బలహీనతలేని వారితో సహవాసం చేస్తే వారి ప్రభావం వీడి మీద పని చేస్తుంది వాడు చేసే సాధన కొంత కలిసి వస్తుంది, అప్పుడు ఈశ్వరానుగ్రహం వస్తుంది. అప్పుడు ఆ బలహీనత నుండి విడుదల పొందుతాడు. అంతే గాని మనకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత ఉన్నవారితో స్నేహం చేస్తే అది రెట్టింపు అవుతుంది.

నిజం హృదయంలో ఉంది అని చెపుతున్నారు. అది హృదయంలోనే ఉండి బయట ఎక్కడా లేదు అనుకోండి. అది నిజం ఎలా అవుతుంది. అన్ని ప్రాంతాలలో అన్ని కాలములలో ఉన్నది నిజం అవుతుందిగాని హృదయంలో ఉండి ఎక్కడా లేకపోతే అది నిజం ఎలా అవుతుంది. అని ప్రశ్న. నిజం హృదయంలోనే ఉంది అని చెప్పటం పాక్షిక సత్యం. అయితే భగవంతుడు ఎందుకు అలా చెప్పాడు అంటే నీవు ఎక్కడ ఉన్నాను అనుకొంటున్నావు అంతటా ఉన్నాను అని అనుకోవటం లేదు, లోపల ఉన్నాను అనుకొంటున్నావు. నీ లోపల ఒక కేంద్రం చూపించటం కోసం హృదయంలో ఉన్నాను అని చెప్పాడు గాని అది తెలుసుకొన్నాక నీకే తెలుస్తుంది ఇదే అంతటా ఉన్నది, అంతటా ఉన్నది ఇదే దీనికి దానికి బేధం లేదు అని నీహృదయంలో ఉన్న నిజం తెలిసాక తెలుస్తుంది అని ఆ దేవుడే చెప్పాడు. నీవు ఏ మతంలో ఉన్నావు, ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నావు అనేది ముఖ్యం కాదు నీకు పునర్జన్మను తీసుకొని వచ్చే వాసనలను ఎంత వరకు తగ్గించుకొంటున్నావు అనేది ముఖ్యంగాని నీవు ఎంత కాలం జీవించావు అనేది ముఖ్యంకాదు. నీవు కోట్లాది రూపాయలు సంపాదించిన, ఇతరులకు అసూయ కలిగించేటంత గొప్ప పదవులను అలంకరించినా, సామ్రాజ్యాలకు అదిపతివి అయినా. నీలో కర్తృత్వబుద్ది ఉన్నంత కాలం దుఃఖం పీడిస్తుంది, అశాంతి పీడిస్తుంది, పునర్జన్మలు ప్రవహిస్తాయి. నీకు వెయ్యికోట్లు డబ్బుఉన్నా నీకు కర్తృత్వబుద్ది పోలేదు అనుకో విపరీతమైన దుఃఖానికి గురి అవుతావు.

నీవు సాధనలు ఎందుకు చేస్తున్నావు అంటే సహజస్థితిని పొందటానికే చేస్తున్నావు. సాధన లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా, సత్పురుషుల సహవాసం లేకుండా సహజస్థితిని నీవు పొందలేవు. మనకు తలంపులు వస్తే కంగారు పడతాము. భగవాన్ ఏమి చెప్పారు అంటే వేలాది తలంపులు వస్తే రానియ్యి వాటి గురించి కంగారుపడవద్దు. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి ఆత్మకు రావటం లేదు, నేను అనే మొదటి తలంపుకే వస్తున్నాయి. ఆ మొదటి తలంపును పట్టుకో. అదే దాని మూలంలోనికి తీసుకొని పోతుంది. దాని మూలంలో ఎవరు ఉన్నారు? నీవే ఉన్నావు. నువ్వు అంటే ఎవరు ఈ అహంకారం కాదు, నీవు ఎవరిగా ఉన్నావో వారిగా ఆ మూల తలంపు మూలంలో ఉన్నావు. అది తెలిసాక తెలుస్తుంది. అది నీవే అన్న సంగతి. అతి తెలియకముందు దానికోసం ప్రయత్నం చేస్తున్నాము అని నీకు అనిపిస్తుంది. అది తెలిసాక తెలుస్తుంది. ఎప్పుడూ నీవు తానుగా ఉన్నానని, ఎప్పుడూ నీవు అదిగానే ఉన్నావని అది తెలిసాక నీకు తెలుస్తుంది. జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషిప్తి అవస్థ ఈ అవస్థలు అన్నీ ఆత్మ అనే తెరమీద వస్తున్నాయి. వెళ్ళిపోతున్నాయి అని చెపితే ఇవి అన్నీ ఎందుకు రావాలి, ఇవి ఎందుకు కదలాలి అని అడుగుతున్నారు. అవస్థలను ఎవరు చూస్తున్నారు అని భగవాన్ అడిగారు నేను చూస్తున్నాను అని చెప్పాడు నువ్వు అంటే నీ మనస్సు చూస్తోంది. ఉన్నది చైతన్యం ఒక్కటే, ఆత్మ ఒక్కటే. ఈ అవస్థలను చూసే మనస్సుకు అంతర్దృష్టి కలిగి ఆత్మాకారం చెందితే ఈ అవస్థలు లేవు అని నీకు తెలుస్తుంది, ఉన్నది ఒకటే అవస్థ అని నీకు తెలుస్తుంది. అది నీవే అని నీకు తెలుస్తుంది.

భగవంతుడికి ఒకరిపట్ల ఎక్కువ ఇష్టం, ఒకరిపట్ల తక్కువ ఇష్టంకాదు, అందరిపట్ల సమానంగా ఉంటాడు. అయితే కొంతమంది వాసనలు వారిని పీడిస్తున్నాయి, కొంతమంది వాసనలు వారిని పీడించటం లేదు. ఎవరి వాసనలు అయితే వారిని పీడించటం లేదో వారు పూర్వజన్మలో ఎక్కువ సాధన చేసి ఉంటారు. ఆ వాసనలు తొలగించుకోవటానికి ఎంతో కష్టపడి ఉంటారు, ఎంతో తపించి ఉంటారు. ఆఫలం ఇప్పడు వారి చేతికి అందుతోంది. అంతే గాని భగవంతుడికి ఒకరి మీద ఇష్టం, ఒకరి మీద అయిష్టంకాదు. అదే విధంగా మీరు ఈ జన్మలో కష్టపడి కొంత సాధన చేస్తే రాబోయే జన్మలో సాధన తేలికఅవుతుంది, గమ్యానికి అతి శీఘ్రంగా చేరుకోగలరు. చేసినది వూరికే పోదు తిరిగి నీకే వస్తుంది. భగవాన్ ఏమంటున్నారు అంటే ప్రయత్నరహిత స్థితి మంచిదే గాని అది ప్రయత్నం లేకుండా రాదు అంటున్నారు సంకల్పాలు, తలంపులు, రాగద్వేషాలు లేని స్థితిని పొందటానికి నీవు ఎంతో కొంత తపించాలి, సాధన చేయాలి, దాని కోసం జీవించాలి. ఇప్పడు మనం అందరము జీవిస్తున్నాము ఎందుకు జీవిస్తున్నాము అంటే మన అహంకారమును సంతృప్తి పరచటానికి జీవిస్తున్నాము. మన హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి జీవించటం లేదు. దేహబుద్ధిని పెంచుకోవటానికి జీవిస్తున్నాము గాని ఆత్మబుద్ధిని పెంచుకోవటానికి జీవించటం లేదు. ఇంక మనకు నిజం ఎలా తెలుస్తుంది.